క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడండి..



కోటవురట్ల సచివాలయం ఆవరణలో మొక్క నాటుతున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

కోటవురట్ల : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని సర్పంచ్ బి.అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. రాను రాను పల్లెలు కూడా కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయని, సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. ఇంటి పరిసరాలు, రహదారుల్లో మొక్కలు నాటుకోవాలన్నారు. కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిరసపల్లిలో నేడు గడప గడపకు

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ లబ్ధిపై ప్రచారం చేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలి అచ్చియ్యనాయుడు కోరారు.

ఎంఎస్ఎంఈ సెంటర్‌లో రక్తదాన శిబిరం

రాంబిల్లి : ఎంఎస్ఎంఈ సెంటర్‌లో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్టీఆర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి వైద్య సిబ్బంది పలు సూచనలు, సలహాలు చేశారు. రక్తదాతలను మెమెంటోలతో సత్కరించారు. ఎంఎస్ఎంఈ మేనేజర్లు డాక్టర్ టి.విజయ కృష్ణకాంత్, జి.రాజ్‌కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ టి.పవన్‌కుమార్, ఎంఎస్ఎంఈ కన్సల్టెంట్ ఎం.కాలేబు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ సాంబశివుని కల్యాణం

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం రాత్రి పార్వతీ సమేత సాంబశివుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వివాహం వైభవంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : పల్లపు ఆనందపురంలో బుధవారం షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో నగర సంకీర్తన, బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

వేసవి దుక్కు పనుల్లో రైతులు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో రైతులు వేసవి దుక్కు పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి సాగుకు నారుమడులు తయారీలో భాగంగా రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు వంటి యంత్రాలను ఉపయోగించగా మరికొందరు రైతులు పాత పద్ధతిలో ఎడ్లతో దుక్కి పనులు చేపడుతున్నారు. వర్షం పడితే నారు కోసం మరో రెండుసార్లు దుక్కి దున్ని విత్తనాలు వేయనున్నట్టు రైతులు తెలిపారు.

పోషకాహారంతో 'సంపూర్ణ' ఆరోగ్యం

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.మండలంలోని మూలపేటలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్ననాడే కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. అలాగే బాలింతలు, గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, మహిళా పోలీసు సరస్వతి, వార్డు సభ్యురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధులపై నిర్లక్ష్యం...'పాడి'కాదు!

- పశువుల్లో అంటువ్యాధులపై పారాహుషార్
- పశుపోషణలో జాగ్రత్తలు అవసరం



కోటవురట్ల : పాడి పశువుల్లో వచ్చే వ్యాధులపై రైతులు అవగాహన పెంచుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. పశువుల్లో వచ్చే అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు వాటి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. పశువుల్లో వ్యాధిని గుర్తించిన వెంటనే మిగతా పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి సోకిన ప్రాంతం, చుట్టూ ఉన్న పరిసరాలతో పాటు పశువులను జాగ్రత్తగా గమనించాలని తెలిపారు.

ఇవీ లక్షణాలు..

వ్యాధి సోకిన పశువుల్లో ఆకలి మందగించడం, మందకొడిగా ఉండడం, శరీర ఉష్ణోగ్రత పెరుగడం, నోరు, ముక్కు, కళ్ల నుండి నీరు కారడం, వాపు వంటి రోగ లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వీటిలో ఏ లక్షణాలు కనిపించినా వెంటనే వాటిని ఆరోగ్యంగా ఉన్న పశువుల నుండి వేరు చేయాలన్నారు.

ఇవీ జాగ్రత్తలు

- వ్యాధి పూర్తిగా తగ్గేంత వరకు పశువులను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.
- వ్యాధి సోకిన పశువులను వేరు చేసిన ప్రతిసారీ ఆ ప్రాంతాన్ని డిసిన్‌ఫెక్టు చేయాలి.
- వ్యాధి సోకిన పశువులను ప్రత్యేకమైన షెడ్లలో ఉంచాలి. వాటిని సంరక్షించేందుకు ప్రత్యేకంగా ఓ వ్యక్తి ఉండాలి.
- వ్యాధి బారిన పడిన పశువుల వద్దకు వెళ్లిన ప్రతిసారి చేతులు, కాళ్లు శుభ్రంగా కడగాలి. రోగగ్రస్త పశువులను బయట తిరగకుండా చూసుకోవాలి. వీటిని సంతలకు పంపకూడదు.
- రోగంతో చనిపోయిన పశువులను అది ఉన్న ప్రాంతంలోని పేడ, గడ్డిని పూర్తిగా కాల్చివేయాలి లేదా పూడ్చి పెట్టాలి. రోగంతో చనిపోయిన పశువులను కనీసం 6 అడుగుల లోతు ఉన్న గోతిలో ఉంచి ఒక అడుగు సున్నం వేసి పూడ్చాలి. లేదా కాల్చివేయడం మంచిది. రోగంతో చనిపోయిన పశువులను కాలువలు, చెరువుల దగ్గర పారవేయకూడదు, పూడ్చి పెట్టకూడదు.
- వ్యాధి సోకగానే పశువుల మేతకు అంతకు ముందు వాడిన పచ్చిక మైదానాల్లో, బీళ్లలో పశువులను మేపకుండా చూడాలి. 5 శాతం ఫినాయిల్ లేదా క్రిసాల్‌ను ఉపయోగించి పశువుల శాలను, పరికరాలను శుభ్రంగా కడగాలి. తరువాత 2.5 శాతం ఫినాయిల్ కలిగిన సున్నంతో షెడ్‌కు పూర్తిగా వెల్ల వేయాలి.
- వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచి వైద్యం చేయించాలి. వ్యాధి లేని పశువులకు, చుట్టు పక్కల ప్రాంతాల్లోని పశువులకు అవసరాన్ని బట్టి వ్యాక్సినేషను చేయించాలి. ఆ ప్రాంత అధికారులు, ఉన్నతాధికారులకు వ్యాధి తీవ్రతను వివరించి అప్రమత్తం చేయాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు


విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లకు స్వస్తిపలికి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్‌లను ఆయన బుధవారం మండలంలోని వాడ్రాపల్లిలో అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం


అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని గణపర్తిలో బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిపారు.

ధనిశెట్టి కృష్ణకు ఎమ్మెల్యే నివాళి


ధనిశెట్టి కృష్ణకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నాయకులు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి కృష్ణ పెద్ద కర్మ కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు సోదరుడైన కృష్ణ అనారోగ్యం కారణంగా ఈ నెల 4 న మృతి చెందారు. కృష్ణ స్వగృహంలో జరిగిన పెద్ద కర్మ కార్యక్రమానికి గొల్ల బాబూరావు హాజరై, కృష్ణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, పీఎల్ పురం సర్పంచ్ పడాల దివాణం తదితరులు కృష్ణకు నివాళులర్పించారు.

నిప్పుల కొలిమిలా....

కోటవురట్ల : సూరీడు విచక్షణారహితంగా విరుచుకుపడుతున్నాడు. గత పది రోజులుగా తీవ్ర వడగాడ్పులతో జనం అల్లాడిపోతున్నారు. రాత్రి 8 గంటలైనా వడగాడ్పుల తీవ్రత తగ్గకపోవడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాడ్పులకు ఉక్కపోత కూడా తోడవ్వడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం కూడా సూరీడు అదే జోరు చూపించాడు. ఉదయం 9 గంటల నుంచే ప్రతాపం చూపించడంతో రహదారులన్నీ ఖాళీ అయిపోయాయి. ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదు కావడంతో హడలెత్తిన జనం ఇళ్లకే పరిమితమయ్యారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన



మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : పంటల సాగుకు సంబంధించి మట్టి నమూనా ఎంతో కీలకమని, భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు.

వాడ్రాపల్లి, అరబుపాలెం గ్రామాల్లో బుధవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త నిర్వహణలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో వివరించారు. శాస్త్రవేత్తలు కిషోర్, బాబు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ తిరుమలరావు, ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వెంకటరాము, రైతులు శరగడం రామకృష్ణ, పసుపులేటి లక్ష్మణరావు, సూర్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాయంత్రం తేలికపాటి చినుకులు

రాంబిల్లి: మండలంలో బుధవారం భిన్న వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వడగాడ్పులతో జనం విలవిలలాడారు. అయితే సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు శబ్దాలతో తేలికపాటి చినుకులు పడ్డాయి. ఉక్కబోత, వేడిగాలులు తాళలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షం పడితే వాతావరణం చల్లబడుతుందని ఆశిస్తున్నారు.

వివాదాస్పద భూమిపై ఆర్డీవో విచారణ

స్పందనలో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు


పెదపల్లిలో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో వివాదాస్పద భూమిపై విచారణకు బుధవారం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తహసీల్దారు రాణీ అమ్మాజీతో కలసి విచారణ చేపట్టారు. పెదపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన వివాదస్పద భూమిపై స్పందనలో కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ రవిపటాన్‌శెట్టి ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ బుధవారం పెదపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదపల్లిలో కొంత భూమి ఆక్రమణకు గురైనట్టు గ్రామంలో కొందరు వ్యక్తులు ఆరోపిస్తూ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి వివాదస్పద భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సమగ్రంగా విచారణ చేపట్టి కలెక్టర్‌కి నివేదిక అందజేస్తామని గ్రామస్తులతో అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామస్తులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం


రక్తదాతను సత్కరిస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్ : ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం క్షతగాత్రులను చాలా వరకు మృత్యువు నుంచి కాపాడుతుందని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎంవీఏ హాల్లో సర్వేజనా ఐక్యవేదిక, చైల్డ్ ఫండ్ ఇండియా, లింగ్ వర్కర్స్ స్కీమ్, ఎస్‌వీడీఎస్, ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంక్, శ్రీసూర్య అభయాంజనేయ బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో కృత్రిమ రక్తం దొరకదని, వ్యక్తుల నుంచి సేకరించిన రక్తాన్ని వివిధ మార్గాల్లో భద్రపరచి అత్యవసరమైన రోగులకు అందిస్తారని తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్య వంతులు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తిలో కేవలం 10 రోజుల్లో రక్తం పూర్వపు స్థాయికి ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదాన దినోత్సవంలో భాగంగా సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. వీరిని సూపరింటెండెంట్ సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి వైద్యురాలు కనకదుర్గ, వివిధ బ్లడ్ బ్యాంక్ సెంటర్ల ప్రతినిధులు కోరిబిల్లి పరి, నదియా, ఆడారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుందరం.. బాలికల వసతి గృహం

- రూ.35 లక్షలతో మరమ్మతులు
- కలెక్టర్ చొరవ.. లారస్ ఔదార్యం


మరమ్మతులు పూర్తి చేసుకున్న వసతి గృహం అంతర్భాగం

కొయ్యూరు/కశింకోట : స్థానిక సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం అందంగా ముస్తాబైంది. అరకొర పనులు మినహా తుది మెరుగులు దిద్దుకుంది. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవ, లారస్ సంస్థ ఔదార్యంతో నూతన హంగులు సంతరించుకున్నాయి. రూ.35 లక్షల నిధులతో లారస్ పరిశ్రమ ఈ పనులను పూర్తి చేసింది.

ఏజెన్సీ వారికి అనుకూలం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన సాంఘిక సంక్షేమశాఖ నిర్మించిన భవనంలో బాలికల వసతి గృహం 2010లో ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాలికలు వచ్చి ఇక్కడ చేరారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 346 మంది బాలికలు ఈ వసతి గృహంలో ఉంటూ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో చదువుతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన బాలికలకు ఈ వసతి గృహం చాలా అనుకూలం. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన చింతపల్లి, పాడేరు, లంబసింగి తదితర ప్రాంతాలనుంచి ఎక్కువగా బాలికలు ఇక్కడ వసతి పొంది, విద్యాభ్యాసం చేస్తున్నారు.

కలెక్టర్ చొరవతో..

ఏళ్లనాటి భవనం కావడంతో మరమ్మతులకు గురైంది. ఏడాది క్రితం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వసతి గృహాన్ని సందర్శించే సమయంలో దీని దుస్థితి తెలుసుకున్నారు. వెంటనే ఆయన చొరవ తీసుకుని, లారస్ ప్రతినిధులతో మాట్లాడారు. బాలికల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకున్న లారస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధుల్లో రూ.35 లక్షలు కేటాయించింది. వేసవి సెలవుల్లో విద్యార్థుల్ని ఇళ్లకు పంపించి, పనులు చేపట్టారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రహరీ ఎత్తు పెంచారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టారు. పాడైన బాత్‌రూమ్‌లను, మరుగుదొడ్లను బాగు చేశారు. భవనానికి అందంగా రంగులు వేసి, విద్యార్థులకు, ఇక్కడ తమ పిల్లల్ని చదివించాలనుకునే తల్లిదండ్రులకు ఆహ్లాదం కలిగేలా తీర్చిదిద్దారు.

17 నుంచి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

తుమ్మపాల : గవరపాలెం సతకంపట్టు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉత్సవ ఏర్పాట్లను చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, కమిటీసభ్యులు నాయుడు, పి.మణి, దొడ్డి రవి, ఆళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జెండా, అజెండా పేదల సంక్షేమమే


చినదొడ్డిగల్లులో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ జెండా, అజెండా పేదల సంక్షేమం కోసమేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం మండలంలో చినదొడ్డిగల్లులో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని ఆరా తీశారు. ఈ పథకాల వల్ల పేదలకు మేలు జరుగుతోందా లేదా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ పింఛన్లు ఇంటికే తెచ్చి ఇస్తున్నారని, ఇంతకు ముందు పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే వాళ్లం అని తెలిపారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వలంటీరు ప్రతి నెలా ఒకటోతేదీ ఉదయాన్నే మా ఇంటి తలుపుతట్టి పింఛను సొమ్ము ఇచ్చి వెళ్తున్నారన్నారు. అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల వల్ల పేద ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ సందర్భంగా పలువురు గృహనిర్మాణ బిల్లులు చెల్లింపులు, ఇళ్ల స్థలాలు మంజూరు వంటి సమస్యలు వివరించగా వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబు, బీసీ సెల్ నాయకులు శీరం నర్సింహమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతారావు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో చినదొడ్డిగల్లులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు జగనన్న ప్రభుత్వం నూతన ఒరవడిని తీసుకు వచ్చిందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియంను అమల్లోకి తెచ్చి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌యూడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ సత్తిబాబు, బీసీ సెల్ నాయకుడు నర్సింహమూర్తి, ఎంఈవో ప్రసాద్, ఎంపీడీవో సీతారామరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలి


శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని మునగపాక పోలీసులు పిలుపునిచ్చారు. మూలపేటలో బుధవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది భాస్కరరావు, వెంకటలక్ష్మి మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలన్నారు. అలాగే భూ తగాదాలకు అవకాశం లేకుండా పెద్దల సమక్షంలో పరిష్కరించుకునేలా చూడాలన్నారు. ప్రధానంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా పోలీసు సరస్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, వార్డు సభ్యులు హైమావతి నాయుడు, గోవిందరావు, వరలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థానికంగా సమస్యలు పరిష్కరించుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశరావు

మునగపాక : పంతాలకు పోకుండా సాధ్యమైనంత వరకు సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ప్రకాశరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ కొంతమంది విచక్షణ కోల్పోయి గొడవలకు దిగుతుంటారని అటువంటి సందర్భంలో సంయమనం పాటించాల్సి ఉంటుందన్నారు. భూ తగాదాల విషయంలో పెద్దల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు పోలీసుస్టేషన్‌కు రాకుండా చిన్న చిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అర్జీదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కమిషనర్‌గా వీరయ్య బాధ్యతల స్వీకారం


కమిషనర్ వీరయ్యను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా డి.ఇ వీరయ్య బుధవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్ రమాకుమారి, కౌన్సిల్ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

ఘనంగా యోగసిద్ధి ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ట


కస్పావీధిలో ప్రతిష్ఠించిన యోగసిద్ధి ఆంజనేయస్వామి

కశింకోట : స్థానిక కస్పావీధిలో నూతనంగా నిర్మించిన యోగసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా హోమం, ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేణుగోపాల స్వామి ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు నిర్వహించారు. ఆలయాన్ని పూలమాలలతో అందంగా అలంకరించి స్వామి విగ్రహానికి కరెన్సీ నోట్ల మాలతో ముస్తాబు చేశారు. విగ్రహాన్ని సమకూర్చిన ఎపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. వీరికి నిర్వాహకులు జ్ఞాపికలను అందించి సత్కరించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని రేజేటి శ్రీరామాచార్యులు ప్రారంభించారు. ఎక్కువ సంఖ్యలో భక్త జనం పాల్గొన్నారు.